క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారించాలి



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఈవోపీఆర్డీ రత్నకుమార్

లింగపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రాష్ ప్రోగ్రాంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విస్తరణ అధికారి జేఎం రత్నకుమార్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని నివారించాలని 22 పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మోటార్లు రిపేర్‌కి వస్తే వెంటనే చేయించాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూఎం షెడ్ల నిర్వహణ, ట్యాక్సెస్ , నాన్ ట్యాక్సెస్, ఐవీఆర్ఎస్ కాల్స్, స్వర్ణ పంచాయతీలు, ఓడీఎఫ్ ప్లస్ పంచాయతీలు పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పూర్ణ చంద్రరావు, డీపీఆర్ సి.శ్యామలరావు, ఎంఆర్‌సీ ప్రభుదాస్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

పోలవరం రూరల్: ఇటీవల మృతి చెందిన పోలవరం గ్రామానికి చెందిన కపిలవాయి సత్యనారాయణ కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. ఆయన భార్యకు కుటుంబ అవసరాలు నిమిత్తం రూ.5 వేలు సంస్థ తరపున అందించారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు పూనెం పోసిబాబు, ఆకుల నరసింహమూర్తి, సిద్ధా కృష్ణమూర్తి, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, చిలకా రాంబాబు, ఎస్.నారాయణ, సుంకర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చేపల మేతగా చనిపోయిన కోళ్లు



మృతి చెందిన కోళ్లను చేపలకు ఆహారంగా వేస్తున్న కూలీ

కామవరపుకోట: మండలంలో వెంకటాపురం గ్రామంలో దుర్గమ్మ ఆలయ సమీపంలో గల చెరువులో చేపలకు మేతగా చనిపోయిన కోళ్లు కుళ్లిన కోళ్లను వేయడం కలకలం రేపింది. గుడివాడ లంకకు చెందిన చేపల వ్యాపారి జయమంగళ లక్ష్మణ్ వెంకటాపురం గ్రామంలో చెరువు లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. వ్యాపారంలో లాభం కోసం రోగాల బారిన పడి చనిపోయిన కోళ్లను చేపలకు ఆహారంగా వేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చేపల పెంపకందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ఎలిషాను వివరణ కోరగా ఇందుకు బాధ్యులైన చేపల చెరువు యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ము గూడెం సెంటర్‌లో ఉన్న షిరిడిసాయి మందిరంలో ఘనంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మందిర కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీనెలా మొదటి గురువారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సాయి మందిరం వార్షికోత్సవం, గురుపౌర్ణమి, కార్తీక పౌర్ణమి, తదితర పర్వదినాల్లో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌డీపీ మద్యం పట్టివేత



మద్యం సీసాలతో పట్టుబడిన నిందితుడు

కుక్కునూరు: అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని సీతారామనగరంలో గురువారం నిర్వహించిన దాడుల్లో ఓ వ్యక్తి వద్ద నుంచి 8 సీసాల తెలంగాణ మద్యం దొరికినట్టు చెప్పారు. దీంతో మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గిరిపుత్రులకు రహదారి కష్టాలు

- పూర్తిగా ధ్వంసమైన ఏజెన్సీ రహదారులు
- మరమ్మతులు చేయాలని కోరుతున్న కొండరెడ్డి గిరిజనులు



దుమ్ము లేస్తున్న వాడపల్లి కాలనీ రోడ్డు



పూర్తిగా ధ్వంసమై రాళ్లు తేలిన అలివేరు రహదారి

బుట్టాయగూడెం: మండలంలోని పలు గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఛిద్రమైన రోడ్లపై ప్రయాణం చేయలేక గిరిపుత్రులు నానా అవస్థలు పడుతున్నారు. మండంలోని మారుమూల గ్రామాలైన అలివేరు, అంకపాకలకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై అలివేరు, లంకపాకల, రేపల్లి, రేగులపాడు, డోలుగండి గ్రామాలకు చెందిన గిరిజన ప్రజలు నిత్యం ప్రయాణాలు చేస్తుంటారు. ఆయా గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఈ రహదారి నుంచి దొరమామిడి, బుట్టాయగూడెం ఆస్పత్రులకు తరలించాలి. ధ్వంసమైన ఆ రోడ్లపై అధిక కిరాయి ఇస్తామన్నా కనీసం ఆటోలు కూడా రావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీరమద్దిగూడెం, వాడపల్లి రోడ్ల పరిస్థితి మరీ అధ్వానం

మండంలోని మారుముల గ్రామమైన వీరమద్దిగూడెం గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ధ్వంసమైన ఈ రహదారికి కనీసం మరమ్మతులు చేపట్టాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు. అదే విధంగా వాడపల్లి కాలనీ రోడ్ల పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ములగలంపల్లి నుంచి వాడపల్లి కాలనీ మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రధాన రహదారి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని అలివేరు రహదారి పూర్తిగా పాడైపోయింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక అనేక అవస్థలు పడుతున్నాం. మా గ్రామాల నుంచి బయట ప్రాంతానికి రావాలంటే ఈ ఒక్క రోడ్డే ప్రధానమైనది. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టి రహదారి కష్టాలు తీర్చాలి.

–కొక్కెర భీమరాజు, అలివేరు

వాడపల్లి రోడ్డు నిర్మించాలి



బుట్టాయగూడెం మండలం వాడపల్లి మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డుపై దుమ్ము రేగి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం, పాలకులు రోడ్డు పనులు చేపట్టాలి. ప్రజలకు రహదారుల కష్టాలు తీరేలా కృషి చేయాలి.

–కారం రాఘవ, న్యూడెమోక్రసీ నాయకులు, అలివేరు

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ పి.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 4వ తేదీ నుంచి పాలీసెట్–2025 హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా కో–ఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం వెల్లడించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఉదయం 9.30 నుంచి 12.30 వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28 వరకు శిక్షణ నిర్వహించి, అదే రోజు విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 15వ తేదీ లోగా పాలీసెట్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఏప్రిల్ 30న పాలీసెట్–2025 పరీక్ష నిర్వహిస్తారన్నారు. అలాగే విద్యార్థులకు కోచింగ్‌కు సంబంధించి ఉచితంగా మెటీరియల్ అందజేస్తామన్నారు. ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో ఉంటాయన్నారు. అలాగే జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు గైడ్‌లైన్స్ ఇచ్చేందుకు ఉచిత ఆన్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తణుకు కేంద్రం కో–ఆర్డినేటర్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్, అధ్యాపకులు బి.రమేష్, కేశవ్, సాగర్లు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏలూరు జిల్లా సెట్వెల్ విభాగం, కళాశాల కెరీర్ గైడెన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సరైన మార్గంలో పయనిస్తూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు జిల్లా సెట్వెల్ సీఈవో కేఎస్ ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తనతో పాటు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, ఉపాధి కల్పనాధికారి జి.ప్రవీణ్‌కృష్ణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, డి.మల్లేష్, పి.ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు



లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ–ఏ, బీసీ–బీ, బీసీ–డీ, బీసీ–ఈ సామాజిక వర్గాలకు చెందిన యువతీ యువకులు 561 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కమిషనర్ కేవీ రమణ తెలిపారు. కాగా శుక్రవారం మిగిలిన కార్పొరేషన్లకు సంబంధించిన అభ్యర్థులకు ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

166 మంది హాజరు

బుట్టాయగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ, కాపు, ఈబీసీ, మేదర, కుమ్మర లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా రుణాలు పొందేందుకు 178 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు 166 మంది హాజరైనట్లు ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎస్‌బీఐ బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా, డీసీసీబీ బ్యాంచ్ మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

చింతలపూడి: ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సీపీఐ చింతలపూడి మండల 13వ మహాసభ గురువారం ఎస్‌కే కాలేషా, జంగా రామచంద్ర రెడ్డిల అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్రం రైతాంగానికి వ్యతిరేకంగా నాలుగు నల్ల చట్టాలు, కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని విమర్శించారు. గతంలో పోలవరం ప్రాజెక్టు 41.15 అడుగులంటే గగ్గోలు పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు అదే పాట పాడుతున్నారన్నారు. పోలవరాన్ని 45.72 అడుగులు నిర్మించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు నిరంధించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన్నవ కృష్ణ చైతన్య, కంచర్ల గురవయ్య, రమణరాజు, టీవీఎస్ రాజు, కె.బుచ్చిబాబు, ఎం.అలెగ్జాండర్, ఎస్.లెనిన్‌బాబు, విప్లవ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బోడ వజ్రం పి.సోమశేఖర్ దొంత కష్ణ ఎస్‌కే జానీ, ఎస్కే మస్తాన్ ముల్లగిరి నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా కో–కన్వీనర్ తోర్లపాటి రాజు, ముల్లంగి కిషోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన యాగం



యాగంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర పాశుపత సహిత భువనేశ్వరి యాగం గురువారంతో ముగిసింది. యాగంలో పూర్ణకుంభం సమర్పించడంతో పాటుగా ముందు మండప పునః పూజలు బ్రహ్మశ్రీ మేడూరి రవితేజ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదిత్యాది నవగ్రహ దేవతా తర్పణాలు మొదలుకొని స్వామి వారి దివ్య శాంతి కల్యాణ తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బాలం దత్తుడు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. మార్చి 31వ తేదీన యాగం ప్రారంభంగా నాలుగు రోజుల పాటు యాగ నిర్వహణను ఘనంగా చేసినందుకు నిర్వాహకులను ప్రజలు అభినందించారు. కాగా ప్రస్తుతం సుబ్రమణ్య స్వామి ఆలయంలో ప్రధాన ద్వారానికి గర్భాలయానికి ఇరువైపులా గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహాలను నెలకొల్పారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



రేపల్లెవాడలో భవన నిర్మాణ కార్మికుల భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ రాజేశ్వరి

కొయ్యలగూడెం: పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు గురువారం ప్రారంభించారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారీ ఆధ్వర్యంలో పెద్దనూతి వద్ద వాటర్ ట్యాంక్ నిర్మాణం, పరింపూడిలో నిర్మించిన సచివాలయ భవన నిర్మాణాలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. అదే విధంగా రేపల్లెవాడలో గత సంవత్సరం నిర్మాణం పూర్తి చేసుకున్న భవన నిర్మాణ కార్మికుల భవనాన్ని జెడ్పీ మాజీ చైర్మన్ రాజేశ్వరి ప్రారంభించారు. కాగా అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సమావేశాలలో స్థానిక సర్పంచ్ విజయకుమారిని గౌరవించలేదని ఉపసర్పంచ్ సంకుకొండ ఆరోపించారు. కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులే ప్రసంగించారని నియోజకవర్గంలోని అతిపెద్ద మేజర్ పంచాయతీ సర్పంచ్ విజయకుమారిని ప్రసంగించకనీయకపోవడంపై వార్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొయ్యలగూడెం: బోడిగూడెం, కొయ్యలగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ రామారావు తెలిపారు. సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం జంగారెడ్డిగూడెం విద్యుత్ ఈఈ ఆదేశాల మేరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

పోలవరం రూరల్/జంగారెడ్డిగూడెం: ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 4వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలవరం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని జంగారెడ్డిగూడెం ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పోలవరం, రామయ్యపేట, కృష్ణారావుపేట, బైనేరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు. నియోగదారులు సహకరించాలని కోరారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: మండలంలోని కుక్కునూరు, అమరవరం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలలో 11 కేవీ ఫీడర్ లైన్ కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపి వేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పి.అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మట్టి అక్రమ తవ్వకాల నిలుపుదల

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో పోలవరం కుడి కాలువ గట్టుపై చేస్తున్న మట్టి అక్రమ తవ్వకాలను ఇరిగేషన్ అధికారులు గురువారం అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఒక జేసీబీని, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్టేషన్‌కు తరలించారు.

రీసర్వేలో తప్పులు లేకుండా చూడాలి

బుట్టాయగూడెం: రీసర్వేలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ పీవీ చలపతిరావు అన్నారు. మండలంలోని రీసర్వే రెండో దశకు ఎంపికైన చింతలగూడెం, కొవ్వాడ గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే చేసే విధానాన్ని, ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ర్యాలీ కూడా చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పాయం రమేష్, సర్పంచ్‌లు మాల్చి వెంకన్నబాబు, కుంజా దుర్గమ్మ, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

ద్వారకాతిరుమల: స్థానిక వైఎస్సార్ సీపీ నేత ఇమ్మడి నాగుని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం పరామర్శించారు. ఇటీవల నాగు తండ్రి నారాయణరావు మృతి చెందారు. వాసుబాబు నాగు ఇంటికి వెళ్లి నారాయణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం నాగుని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటువంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలన్నారు. అలాగే నల్లజర్ల మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కారుమంచి రమేష్ నాగుని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, మానుకొండ సుబ్బారావు, వర్మరాజు, గ్రామానికి చెందిన ఇమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులకు మోక్షమెప్పుడో!

- పథకం పేరు మార్చి అమలును గాలికి వదిలేసి
- అసంపూర్తిగా 42 గదుల నిర్మాణం



పెదనింద్రకొలను హైస్కూల్‌లో నిలిచిన గదుల నిర్మాణం



బావాయిపాలెం హైస్కూల్‌లో నిలిచిన అదనపు గదుల నిర్మాణం

నిడమర్రు: వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ బడులు కార్పొరేట్‌ను తలదన్నేలా మౌలిక వసుతులు సమకూరాయి. మనబడి నాడు – నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వసతులు కల్పించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం బోధన మాత్రమే జరిగేది. అధికారం మారింది. పేదల చదువుపై వివక్ష ప్రారంభమైంది. గత సర్కారులో ఫేజ్–1 కింద నాడు – నేడు పథకంలో నియోజకవర్గంలో 95 పాఠశాలలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఫేజ్–2లో 84 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అవసరమైన పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఫేజ్–2లో గుర్తించి నిధులు కూడా మంజూరు చేశారు. పాఠశాలల ఖాతాల్లో గత ప్రభుత్వంలో విడుదల చేసిన నిధులు ఉన్నా, ప్రస్తుతం ఆ నిర్మాణాలు అన్ని అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు అసౌకర్యాల మధ్య తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

నాడు పనుల పరుగు

జగన్ సర్కారులో నాడు – నేడు పనులు పరుగులు పెట్టాయి. అనుకున్న సమయానికి అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వ మారి ఏడాది గడుస్తున్నా నిధుల వినియోగంపై ఆంక్షలతో పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో నిడమర్రు మండలంలో నాడు – నేడు పథకంలో 20 స్కూళ్లను ఎంపిక చేసి, అభివృద్ధి పనులను పూర్తి చేశారు. ఫేజ్–2లో సౌకర్యాల కల్పనకు 9 స్కూళ్లను ఎంపిక చేశారు. వీటితోపాటు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో నిర్వహిస్తున్న 6 అంగన్‌వాడీ భవనాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. నిడమర్రు మండలంలో నాలుగు స్కూల్స్‌లో 12 అదనపు గదుల నిర్మాణం ప్రారంభించారు.

నిలిచిన నిర్మాణాలు

ఉంగుటూరు నియోజకవర్గంలో నాడు–నేడు పథకంలో అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. నిడమర్రు మండలం బువ్వనపల్లి యూపీకి రెండు, నిడమర్రు జెడ్పీహెచ్ స్కూల్‌కి ఒకటి, పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్‌కి 4, బావాయిపాలెం జెడ్పీస్కూకి 5 తరగతి గదులు. ఉంగుటూరు మండలం ఉంగుటూరు, రాచూరు, నారాయణపురం, కైకరం, కాగుపాడు, రావులపర్రు గ్రామాలోని జెడ్పీ స్కూల్స్‌కి రెండు అదనపు తరగతి గదుల చొప్పున, చేబ్రోలు ఉర్దూ స్కూల్‌కి ఒక అదనపు తరగతి గది మంజూరు చేశారు. గణపవరం మండలం కాశిపాడు, గణపవరం గరల్స్ జెడ్పీ స్కూల్స్‌కి రెండేసి చొప్పున, ముప్పర్తిపాడు స్కూల్‌కి, డీకేవల్లి స్కూల్స్‌కి ఒక్కొక్కటి చొప్పున, భీమడోలు మండలం గుండుగోలను, పూళ్ల జెడ్పీస్కూల్స్‌కి 9 గదులు, అన్నేవారిగుడెం యూపీకి, ఆగడాలలంక జెడ్పీ స్కూల్స్‌కి, భీమడోలులో 4 స్కూల్స్‌కి ఒకటి చొప్పున అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. 2024 సంవత్సరంలో ఎన్నికల ముందు మార్చి నెలలో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశిస్తూ నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నిధులను ఎవ్వరూ ఏవిధంగా ఖర్చు చేయవద్దని హెచ్‌ఎంలకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో వీటి నిర్మాణాలకు సరిపడా నిధులు ఉన్నా, వినియోగించుకోని పరిస్థితిల్లో ఆ పేరెంట్ కమిటీలు ఉన్నట్టు చెబుతున్నారు.

అమలులో శ్రద్ధ అవసరం



నాడు – నేడు పథకం పేరును మనబడి – మన భవిష్యత్ పేరుగా మార్చి ప్రభుత్వం ప్రజలను ఏమార్చుతున్నట్టుంది. పథకాల పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ అమల్లో కూడా ఉండాలి. గ్రామాల్లో నాడు – నేడు పథకంలో మంజూరైన అదనపు తరగతి గదులను, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు

మంచినీటి ఎద్దటి నివారణకు కార్యాచరణ

ఉంగుటూరు: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.44.80 లక్షలతో కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశామని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి వెల్లడించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మంచినీటి సమస్య తలెత్తే గ్రామాలను గుర్తించామన్నారు. ఇప్పటికే డెల్టాలో 13, మెట్టలో ఆరు గ్రామాల్లో ఫిల్టరు బెడ్లలో ఇసుక మార్పిడి పనులు చేశామని, రూ.37.30 లక్షలు వెచ్చించి ఫిల్టరు బెడ్లు సిద్ధం చేశామని చెప్పారు. గోపినాథపట్నంలో మంచి నీటి బోరు వేశామన్నారు. గుళ్లపాడులో మరో బోరు వేశామని తెలిపారు.